క్లుప్తంగా

ద్రాక్ష పండ్లతో బాలాత్రిపుర సుందరీ దేవికి అలంకరణ



ద్రాక్ష పండ్ల అలంకరణలో బాలాత్రిపుర సుందరీ దేవి

భీమవరం (ప్రకాశంచౌక్): అమావాస్య సందర్భంగా భీమవరం మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరి అమ్మవారికి శుక్రవారం ద్రాక్ష పండ్లతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన జనుపాముల సాయి సతీష్, సుష్మా కనక మహాలక్ష్మి దంపతులతో కొమ్ము శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ద్రాక్ష పండ్లతో పూజ చేసి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, బాల త్రిపుర సుందరి మహిళ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లా జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనవిజ్ఞాన వేదిక 38వ ఆవిర్భావ దినోత్సవాన్ని యూటీఎఫ్ కార్యాలయం ఆవరణలో నిర్వహించారు. జేవీవీ సీనియర్ నాయకులు పి సీతారామరాజు అధ్యక్షత వహించారు. జేవీవీ మరో సీనియర్ నాయకులు వై అజయ్ కుమార్ జేవీవీ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె. రామలక్ష్మణరావు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చెకుముకి సైన్సు సంబరాలను నిర్వహిస్తోందని, విద్యార్థులలో ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి కృషి చేస్తుందని అన్నారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి ప్రసాదరావు, చెకుముకి జిల్లా కన్వీనర్ రేపాక వెంకన్నబాబు, జేవీవీ నాయకులు ఏ.ఇస్రాయేలు రాజు, ఫణి రాజేష్, అప్పలరాజు పాల్గొన్నారు.

అన్నదాతకు ‘విశిష్ట గుర్తింపు సంఖ్య’

- ప్రతి రైతుకు ప్రత్యేక సంఖ్య జారీ చేస్తున్న కేంద్రం
- నమోదు అయితేనే ప్రభుత్వ పథకాలు
- చురుగ్గా సాగుతున్న ప్రక్రియ

భీమవరం అర్బన్: ప్రస్తుతం ఉన్న ఆధార్ కార్డుల తరహాలోనే ఫార్మర్ రిజిస్ట్రీ కార్డులను ప్రభుత్వ యంత్రాంగం జారీ చేస్తుంది. ఫార్మర్ రిజిస్ట్రీ పేరిట ప్రత్యేక యాప్ ద్వారా చేపడుతున్న ఈ నమోదు ప్రక్రియ ద్వారా 11 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్యను ప్రతి రైతుకు జారీ చేస్తారు. సాగు చేసే ప్రతి రైతు ఈ గుర్తింపు నంబర్‌ను కలిగి ఉండటం ద్వారా భవిష్యత్తులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను పొందడానికి అర్హత లభిస్తుంది. అంతేకాకుండా ఈకేవైసీ పథకానికి ఫార్మర్ రిజిస్ట్రీ విశిష్ట సంఖ్య అవసరం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ప్రక్రియను క్షేత్రస్థాయిలో వేగవంతం చేశారు. భీమవరం మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ స్వయంగా ఫార్మర్ రిజిస్ట్రీ ప్రకియను పరిశీలించి పలు సూచనలు చేశారు.



వ్యవసాయశాఖ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీని నమోదు చేస్తున్న అధికారులు

నమోదు విధానం ఇలా...

భూమి కలిగిన రైతులు తమ పట్టాదారు పాసు పుస్తకం, 1 బీ అడంగళ్, ఆధార్ కార్డు కాపీలతో పాటు ఆధార్ కార్డుకు లింక్ అయిన ఫోన్ నంబర్‌ను వారి గ్రామంలోని సచివాలయానికి అనుబంధంగా ఉన్న రైతు సేవా కేంద్రానికి తీసుకు వెళ్లాలి. అక్కడ గ్రామ వ్యవసాయ సహాయకులు (వీఏఏ) సంబంధిత పోర్టల్‌లో ఫార్మర్ నమోదు ప్రక్రియను చేపడతారు. ఈ క్రమంలో ఫోన్ నంబర్‌కు వచ్చే మూడు ఓటీపీలు చెప్పాల్సి ఉంటుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ విజయవంతం అయినట్లు ఫోన్‌కు సమాచారం వస్తుంది. దీంతో నమోదు ప్రక్రియ పూర్తయినట్లు భావించాలి. ఇలా నమోదు చేసుకుంటూనే ప్రభుత్వ పథకాలు పక్కాగా వర్తిస్తాయి. విశిష్ట గుర్తింపు సంఖ్య జారీ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రైతు సంక్షేమ కార్యక్రమాలు అర్హులకు అందించేందుకు వీలవుతుందని ప్రభుత్వాధికారులు చెబుతున్నారు. నమోదు ప్రక్రియ అనంతరం రైతులకు జారీ చేసిన విశిష్ట గుర్తింపు సంఖ్యను భద్రపరచుకోవాలి. ఒక వేళ గుర్తింపు సంఖ్యను మర్చిపోయినా రైతు సేవా కేంద్రానికి వెళ్లి, తమ భూమి వివరాలు ఇచ్చి సదరు సంఖ్యను తెలుసుకోవచ్చు.

ఎంతో ప్రయోజనం



ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను మండలంలో వ్యవసాయాధారిత గ్రామాల్లో విస్తృతంగా గ్రామ వ్యవసాయ సహాయకులు చేపడుతున్నారు. ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఆధార్ నంబర్ ద్వారా మన వివరాలు ఏ విధంగా తెలుస్తాయో, అలాగే ఈ 11 అంకెల ఫార్మర్ రిజిస్ట్రీ రైతులకు అందుతున్న పథకాలపై సమాచారం ఉంటుంది. ఏ పథకానికి రైతులు అర్హుడు అన్నది కూడా తెలుస్తుంది.

– నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

2న దివ్యాంగ క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

భీమవరం (ప్రకాశంచౌక్): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, దివ్యాంగుల క్రికెట్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ పోటీలకు ఎంపికలు నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ యడ్లపల్లి సూర్యనారాయణ తెలిపారు. మార్చి 2వ తేదీ ఆదివారం ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల క్రీడామైదానంలో ఉదయం 9 గంటల నుంచి ఎంపికలు ప్రారంభమవుతాయన్నారు. ఉమ్మడి పశ్చిమకు చెందిన దివ్యాంగ క్రీడాకారులు అర్హులని తెలిపారు. సెలెక్షన్స్‌కు హాజరయ్యే వారు ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్ కలిగి, వైట్ డ్రెస్‌కోడ్, క్రికెట్ కిట్‌తో హాజరు కావాలని సూచించారు. ఈ సెలెక్షన్స్ జిల్లా క్రికెట్ సంఘం కోచ్ జి.సత్యనారాయణ పర్యవేక్షణలో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు.

నేటి నుంచి తేనెటీగల పెంపకంపై శిక్షణ

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై శనివారం నుంచి శుక్రవారం వరకు శిక్షణ ఇస్తున్నట్టు ప్రోగ్రాం కోఆర్డినేటర్ ఎస్ మల్లికార్జున రావు తెలిపారు. 25 మంది యువతకు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.

శాస్త్రవేత్తల్లో అగ్రగణ్యుడు సర్ సీవీ రామన్

భీమవరం (ప్రకాశంచౌక్): ఆధునిక భారతీయ శాస్త్రవేత్తల పరిశోధన ప్రతిభను అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన వ్యక్తుల్లో సర్ సీవీ రామన్ అగ్రగణ్యుడని మున్సిపల్ కమిషనర్ కె రామచంద్రరెడ్డి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం సర్ సీవీ రామన్ స్కూల్లో శుక్రవారం రామన్ జయంతి, నేషనల్ సైన్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కూలు స్థాయి నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రిన్సిపాల్ పెండ్యాల సరిత, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి పోటీల్లో గెలుపొందిన విజేతలకు అరసవల్లి చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో బహుమతులు అందజేశారు. కే పార్వతి, శైలజ, వరలక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

సామాన్యునికి ఉపయోగపడేలా పరిశోధనలు రావాలి

సామాన్యునికి ఉపయోగపడే విధంగా వైద్యరంగంలో మరిన్ని పరిశోధనలు చేయాలని వరంగల్ ఎస్ఆర్ యూనివర్సిటీకి చెందిన నానో టెక్నాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ఎస్ దుబె అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సైన్స్ డే నిర్వహించారు. ఇంజనీరింగ్ ఫిజిక్స్ హెడ్ డాక్టర్ ఎం సోమేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్ఎస్.దుబె మాట్లాడుతూ వైద్య రంగంలో నానో టెక్నాలజీ పరిశోధనల ఆవశ్యకతను వివరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు, ఇంజనీరింగ్ ఫిజిక్స్ హెడ్ డాక్టర్ ఎం సోమేశ్వరరావు మాట్లాడుతూ వైద్య రంగంలో ఏఐ ప్రాముఖ్యతను వివరించారు. ఇంజనీరింగ్ ఫిజిక్స్ అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని నానో టెక్నాలజీ పరిశోధనా రంగంలో నిపుణుడు డాక్టర్ ఆర్ఎస్ దుబేను ఘనంగా సత్కరించారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పాఠశాలల్లో ఘనంగా నేషనల్ సైన్స్‌డే

స్థానిక ఆదిత్య స్కూల్లో నేషనల్ సైన్స్‌డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ ఆదిత్య కృష్ణంరాజు మాట్లాడుతూ సుమారు 100 మంది చిన్నారులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్, కేవీ సత్యనారాయణ, జి.మోహన్ పాల్గొన్నారు. స్థానిక మెంటేవారితోటలోని వండర్ కిడ్స్ పాఠశాల సైన్స్ ఫెయిర్‌లో 600 మందికి విద్యార్థులు సైన్స్ మోడల్స్‌ను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా తహసీల్దార్ రావి రాంబాబు హాజర య్యారు. స్కూల్ డైరెక్టర్ అల్లు వంశీకృష్ణ, హెచ్ఎం అల్లు వనజాక్షి, చైర్మన్ అల్లు రామకృష్ణ పాల్గొన్నారు.

దేశ ఆర్థిక ప్రగతికి ఉపయోగపడే ఉత్పత్తులు రూపొందించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): భారతదేశంలో ఉన్న అపారమైన వనరులను ఉపయోగించి దేశ ఆర్థిక ప్రగతికి, అభివృద్ధికి ఉపయోగపడే ఉత్పత్తులు తీసుకురావడానికి యువ ఇంజనీర్లు కృషి చేయాలని జిల్లా హార్టీకల్చర్ అధికారి ఆర్ దేవానంద్ కుమార్ కోరారు. సైన్స్ డేను పురస్కరించుకొని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఇంజనీరింగ్ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో అనుసంధానం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ పరిశీలించి అభినందించారు. విద్యార్థుల రూపొందించిన స్మార్ట్ సిటీ ప్రాజెక్టు విశేషంగా ఆకట్టుకుంది. ఇంజనీరింగ్ కెమిస్ట్రీ హెడ్ డాక్టర్ పి భవాని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం జగపతి రాజు. ప్రిన్సిపల్ డాక్టర్ కె.వి మురళీకృష్ణంరాజు పలు అంశాలు వివరించారు. పలు అంశాల్లో విజేతలైన విద్యార్థిని విద్యార్థులకు దేవానంద్ కుమార్ జ్ఞాపికలు అందించారు. డాక్టర్ చంద్రశేఖర్ , డాక్టర్ దివాకర్‌తో పాటు ఇంజనీరింగ్ కెమిస్ట్రీ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



ఎస్ఆర్కేఆర్ కళాశాలలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టును పరిశీలిస్తున్న జిల్లా హార్టీకల్చర్ అధికారి

తాటాకిల్లు దగ్ధం

వీరవాసరం: రాయకుదురు గుడాల వారి వీధిలో శుక్రవారం ఉదయం తాటాకు ఇల్లు దగ్ధమైంది. గ్రామానికి చెందిన తోట రాంపండు, గనిపిరెడ్డి అమ్ములు కుటుంబాల వారు రెండు పోర్షన్ల తాటాకు ఇంట్లో నివాసం ఉంటున్నారు. శుక్రవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో నిప్పులు చెలరేగి తాటాకు ఇంటికి నిప్పులు చెలరేగాయి. ఆ సమయంలో ఇంట్లో మగవారు ఎవరూ లేకపోవడంతో మహిళలు పెద్ద ఎత్తున కేకలు వేస్తూ బయటకు పరుగులు తీశారు. అప్పటికే మంటలు వ్యాపించి తాటాకిల్లు పూర్తిగా దగ్ధమైంది. పాలకొల్లుకు చెందిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఇంట్లో ఉన్న బట్టలు, నగలు, డబ్బు అంతా అగ్నికి ఆహుతి అయిపోయిందని సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లిందని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఘటన ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులు సందర్శించి విచారణ చేసి బాధితులకు తాత్కాలిక సహాయం అందజేశారు.

8న జాతీయ లోక్ అదాలత్

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లా 3వ అదనపు కోర్టులో పెండింగ్‌లో ఉన్న వాహన ప్రమాదాలకు సంబంధించి బీమా కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా రాజీకి ప్రయత్నం చేయాలని న్యాయమూర్తి బి.లక్ష్మి నారాయణ సూచించారు. మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 3వ అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ చైర్మన్, ఫోక్సో కోర్టు ప్రత్యేక న్యా యమూర్తిగా బి.లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం న్యాయమూర్తి ఫోక్సో కోర్టులో బీమా కేసులపై న్యాయవాదులతో ఆమె ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. బార్ అసోసియేషన్ సెక్రటరీ అడపాల ప్రసన్నకుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

పౌర హక్కులను కాపాడుకుందాం

ఆకివీడు : పౌరు హక్కుల్ని కాపాడుకోవాలని తహసీల్దార్ ఎస్ వెంకటేశ్వరరావు అన్నారు. పెదకాపవరం సచివాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు ఉన్న ప్రాంతాల్లో అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వంటపాటి ఆంజనేయులు, గ్రామస్తులు, అంగన్‌వాడీ వర్కర్లు , ఆశ వర్కర్ పాల్గొన్నారు.

కుల వివక్ష చూపడం నేరం

పాలకోడేరు: కుల వివక్ష చూపడం, సైగలు, మాటలు, చేతల ద్వారా దూషించడం, అవమాన పరచడం ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం 1989 ప్రకారం నేరమని పాలకోడేరు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎస్ భారతి విజయలక్ష్మి అన్నారు. గొరగనమూడి సచివాలయంలో నిర్వహించిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.రెడ్డియ్య, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ జీవీజీ లక్ష్మి, పంచాయతీ కార్యదర్శి సరళ, వీఆర్వో శ్రీనివాస్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆకివీడు : మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటేశ్వరరావు

రాయకుదురులో హోరాహోరీగా చెడుగుడు పోటీలు

వీరవాసరం: రాయకుదురు శివారు జగన్నాథరావుపురంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, బేతపూడి, బల్లిపాడు, చీరాల టీముల మధ్య పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఈ పోటీలను తిలకించేందుకు క్రీడాభిమానులు వస్తున్నారని మ్యాచ్ రిఫరీ బాజీంకి గంగా మహేష్ తెలిపారు.

ప్రకృతి సాగును ప్రోత్సహించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): రైతులను ప్రకృతి సాగుకు ప్రోత్సహించి, వారికి మెరుగైన మార్కెటింగ్ సౌకర్యం కలిపించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. ప్రకృతి సాగు ముందస్తు ప్రణాళికపై కలెక్టర్ అధ్యక్షతన శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. 2024–25లో 13 వేల ఎకరాల్లో ప్రకృతి పంటల సాగు చేయగా, ఈ సంవత్సరం 50 వేల ఎకరాలు లక్ష్యంగా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేశామన్నారు. ప్రతి సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో ఆర్గానిక్ ఉత్పత్తులు అమ్ముతున్నారని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పట్టణంలోని ప్రకాశం రోడ్డు, జువ్వలపాలెం రోడ్డు లో ఆర్గానిక్ ఉత్పత్తుల అమ్మకాలకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఏబీపీఎంజేఏవై ఆన్‌లైన్ వేగవంతం

పాలకోడేరు: స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని గొరగనమూడి గ్రామంలో ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీపీఎంజేఏవై) ఆన్‌లైన్ కార్యక్రమాన్ని వేగవంతంగా చేస్తున్నట్టు వైద్యాధికారి చినమిల్లి రంగమ నాయుడు తెలిపారు. ఈ పథకానికి 70 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు అర్హులేనని, ప్రభుత్వం నిర్దేశించిన ఆసుపత్రుల్లో గరిష్టంగా రూ.5 లక్షల వరకు ఆరోగ్య బీమా వర్తిస్తుందని చెప్పారు. గత నెల రోజులుగా ఈ పథకం ఆన్‌లైన్ కొనసాగుతున్నట్టు వివరించారు.

భూములకు హద్దులు గుర్తించాలి

కాళ్ల: భూములకు ఖచ్చితమైన హద్దులు గుర్తించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కాళ్ల గ్రామంలో రీ సర్వేను ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. రైతులతో మాట్లాడి సర్వే ప్రయోజనాలను వివరించారు. వారి అనుమానాలను నివృత్తి చేశారు. రీ సర్వేకు సహకరించాలని రైతులను కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించి, తగు సూచనలు చేశారు. తహసీల్దార్ జి.సుందర్ సింగ్, సర్వేయర్ ఎస్.ప్రవీణ్, ఆర్ఐ లక్ష్మీ కిరణ్, వీఆర్వో శివ నాగరాజు ఉన్నారు.

అపరిష్కృత సమస్యలపై దృష్టి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ వహించాలని సంబంధిత రెవెన్యూ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం జేసీ చాంబర్ నుంచి టి.రాహుల్ కుమార్ రెడ్డి పలు అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లతో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటించి నిర్దేశించిన గడువులోపు సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులు ఆదేశించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఉండి: ఇటీవల సిద్ధాపురంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి స్కూల్ క్రీడల్లో ప్రతిభ కనబర్చిన ఎన్నార్పీ అగ్రహారం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులను హెచ్ఎం ఎంవీ సూర్యనారాయణ అభినందించారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పి.సురేఖ (9వ తరగతి) 400 మీటర్ల పరుగులో ప్రథమ, పి.చంద్రశేఖర్ నాయుడు 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ విభాగంలో ద్వితీయ, డిస్కస్ త్రోలో తృతీయ, బాలికల ఖోఖో పోటీలో పలువురు ప్రతిభ కనబర్చారని తెలిపారు. వీరితో పాటు పీఈటీ కె.శ్రీనివాసరావును హెచ్ఎంతోపాటు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రాధాన్యతా రంగాలకు మొండి చేయి

ఆకివీడు : రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలకు మొండి చేయి చూపారని వైఎస్సార్ సీపీ పట్టణ, మండల అధ్యక్షులు అంబటి రమేష్, నంద్యాల సీతారామయ్య ఆరోపించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ బడ్జెట్‌లో అన్ని కేటాయింపులూ మొక్కుబడిగా, అంకెల గారడీగా ఉన్నాయన్నారు. ఎన్నికల హామీలు సూపర్ సిక్స్‌కు కూడా అరకొర కేటాయింపులే జరిగాయని వివరించారు. సంపద సృష్టికి బడ్జెట్‌లో స్థానమెక్కడ అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రజల బడ్జెట్ ప్రవేశపెట్టిందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ స్పందిస్తూ పేదల సంక్షేమం కోసం సూపర్ సిక్స్ పథకాల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారని ఆయన అన్నారు.

శ్రీరాంపురంలో పట్టపగలు చోరీ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం శ్రీరాంపురంలో నెలపల్లి శ్రీనివాస్ ఇంటిలో శుక్రవారం మధ్యాహ్నం దొంగతనం జరిగింది. దీనిపై కేసు నమోదు చేసిన టూ టౌన్ ఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాంపురం నివాసం ఉంటున్న నెలపల్లి శ్రీనివాస్ దంపతులు శుక్రవారం ఇంటికి తాళం వేసి బయటకి వెళ్లి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి ఇంట్లోని 14 గ్రాముల బంగారం, పదిహేను వేల నగదు చోరీకి గురైనట్టు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నేటి నుంచి పశువులకు టీకాలు

ఆకివీడు : పశువులకు వ్యాధినిరోధక టీకాల మాసోత్సవాన్ని మార్చి 1 నుంచి 30 వరకు నిర్వహించనున్నట్టు మండల పశు వైద్యాధికారిణి కెల్లా భార్గవీ సత్య శుక్రవారం తెలిపారు. శనివారం అయిభీమవరంలో పశువులకు టీకాలు వేస్తామని చెప్పారు.

పదవీ విరమణ వృత్తికే కానీ సేవలకు కాదు

భీమవరం (ప్రకాశంచౌక్): పోలీసు ఉద్యోగులకు పదవీ విరమణ కేవలం వృత్తికే కానీ సమాజ సేవలకు కాదని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి అన్నారు. పోలీసు విభాగంలో పదవీ విరమణ పొందిన సిబ్బందిని శుక్రవారం ఆయన సన్మానించారు. తాడేపల్లిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఈ ఎస్.రాంబాబు, తణుకు టౌన్ పోలీస్ స్టేషన్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆర్. కొండలరావు ఉద్యోగ విరమణ చేశారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) వి. భీమారావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, సీహెచ్ మోజేష్ పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

భీమవరం (ప్రకాశంచౌక్): విద్యార్థులు కోసం ఆరోగ్యం మహాభాగ్యమని, విద్యతోపాటు క్రీడల్లో ప్రతి ఒక్కరూ క్రీడల్లో రాణించాలని ఆరోగ్యం కాపాడుకోవాలని డీఎన్నార్ కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణ రాజు (బాబు) అన్నారు. డిఎన్ఆర్ కాలేజీ ఆఫ్ లా 35వ వార్షికోత్సవం సందర్భంగా వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే రఘురాం , ఫిజికల్ డైరెక్టర్ నరసింహ రాజు, వై అశోక్ కుమార్, చెల్లబోయిన రంగారావు, జీడీ నాయుడు, ఎం భాస్కర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై జేసీ సమీక్ష

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మున్సిపాలిటీలో శుక్రవారం మున్సిపల్ ప్రత్యేక అధికారి జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలోని ప్రతిపాదించిన అభివృద్ధి పనులు ఇతర అంశాలపై అధికారులతో సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్ రామచంద్ర రెడ్డి మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

కాళ్ల: మండలంలోని సీసలి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (స్పెషల్)లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు తయారుచేసిన ప్రాజెక్టులను ఎంఈఓ ఎ.రవీంద్ర పరిశీలించి ప్రశంసించారు. సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా సైన్స్ ఉపాధ్యాయులను హెచ్ఎం ఏవీ సుబ్బరాజు సత్కరించారు.

ఉండి: స్థానిక శశి స్కూల్లో శుక్రవారం విద్యార్థులు పలు ప్రయోగాలను స్వయంగా తయారు చేసి ప్రదర్శించి ఆకట్టుకున్నారు.